క్లుప్తంగా

నేటి నుంచి గ్రామసభలు

ఇచ్చోడ: మండలంలో అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయల్లో మంగళవారం నుంచి గ్రామసభలు నిర్వహించనున్నాట్లు ఎంపీడీవో లక్ష్మణ్ తెలిపారు. సోమవారం ఆయన కార్యాలయంలో మాట్లాడారు. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డుల జారీ, రైతు భరోసా, ఆత్మీయభరోసా పథకాలపై గ్రామసభలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 21న బోరిగామ, దాబా(కే), జున్ని, కేశవపట్నం, దాబా(బి), ముఖరా(కే), అడేగామ(బి), ఎల్లమ్మగూడ, మల్యాల్, దాబా(కె) గ్రామాల్లో, 22న మాదపూర్, సాథ్‌నంబర్, గేర్జం, తలమద్రి, ముఖరా(బి), జామిడి, ఇచ్చోడ, నర్సాపూర్, నవేగావ్, బావోజీపేట్, అడేగామ(కె), హిరపూర్, కామాగిరి, గుండాల, సల్యాద, మాన్కపూర్, 23న చించోలి, దేవుల్‌నాయక్‌తండా, సిరిచెల్మ, కోకస్‌మన్నూర్, దర్మంపూరి, గుండివాగు, చించోలి గ్రామాల్లో పంచాయతీ ప్రత్యేకాధికారులు ద్వారా గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

నేడు బీజేపీ సమావేశం

ఇచ్చోడ: మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఉదయం 11 గంటలకు అత్యవసర సమావేశం నిర్వహించనున్నట్లు బీజేపీ మండల అధ్యక్షుడు తహిరే రమేశ్ తెలిపారు. సమావేశానికి అన్ని మోర్చాల అధ్యక్ష, కార్యదర్శులతో పాటు ముఖ్య నాయకులు హాజరు కావాలని కోరారు.

'దాడిచేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి'


నిరసన తెలుపుతున్న నాయకులు

నేరడిగొండ: రంగారెడ్డి జిల్లాలోని తుక్కుగూడ ప్రధానోపాధ్యాయుడిపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారని, వారిని వెంటనే శిక్షించాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ఆడే నూర్‌సింగ్ డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో గల ప్రాథమిక పాఠశాల వద్ద ఉపాధ్యాయులతో కలిసి నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వినోద్, రవీందర్ పాల్గొన్నారు.

గుబిడి గ్రామానికి బస్సు సౌకర్యం


బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

తాంసి: భీంపూర్ మండలంలోని గుబిడి గ్రామానికి ఆర్టీసీ అధికారులు సోమవారం బస్సు సౌకర్యం కల్పించారు. గ్రామానికి ఉన్న మట్టిరోడ్డు వర్షాకాలంలో అధ్వానంగా మారడంతో బస్సు సర్వీస్ నిలిపివేశారు. కాగా గ్రామస్తులు రోడ్డును బాగుచేసి, బస్సు సౌకర్యం కల్పించాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌కు విన్నవించారు. ఎమ్మెల్యే ఆదిలాబాద్ ఆర్టీసీ అధికారులతో మాట్లాడారు. కాగా స్పందించిన అధికారులు గుబిడి గ్రామానికి బస్సు సర్వీస్‌ను సోమవారం ప్రారంభించారు. దీంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

టీబీ నిర్ధారణ పరీక్షలు


టీబీ నిర్ధారణ పరీక్షలు చేస్తున్న సిబ్బంది


బోథ్: మండలంలోని అందూర్ గ్రామంలో సోమవారం టీబీ నిర్ధారణ పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో 36 మంది నుంచి టీబీ పరీక్షలకు సంబంధించి నమూనాలు సేకరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ దేవిదాస్, సంధ్య, అనిత, హెచ్‌ఈ యశోద, ఎంఎల్‌హెచ్‌పీ శ్రుతి, అర్చన, ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అప్రెంటీస్ మేళాకు అపూర్వ స్పందన

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో సోమవారం నిర్వహించిన ప్రధాన మంత్రి నేషనల్ అప్రెంటీస్ మేళాకు అపూర్వ స్పందన లభించిందని కళాశాల ప్రిన్సిపాల్ రొడ్డ శ్రీనివాస్ అన్నారు. మేళాలో మొత్తం మూడు కంపెనీలు పాల్గొనడం జరిగిందన్నారు. 34 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూకు హాజరు కాగా 27 మంది ఎంపికయ్యారన్నారు. 22 మందికి ఆఫర్ లెటర్లు అందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ ఐటీఐ నోడల్ అధికారి శ్రీనివాస్, ఉట్నూర్ ఐటీడీఏ జాబ్ డెవలప్‌మెంట్ అధికారి వినోద్‌కుమార్, అభ్యర్థులు, తదితరులు పాల్గొన్నారు.

సాగునీరు అందట్లే..!

- పూడికతో నిండిన తాంసి చెరువు
- తగ్గిన నీటి నిల్వ సామర్థ్యం
- 20 ఏళ్లుగా చేయని మరమ్మతులు


నీరులేక చెరువులో పెరిగిన చెట్లు

తాంసి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ ఎకరాకు సాగునీటిని అందించాలనే ఉద్దేశ్యంతో ప్రాజెక్టులు, చెరువులు, చెక్‌డ్యాంల నిర్మాణానికి నిధులు కేటాయిస్తూ.. పనులు చేపడుతోంది. ఆయా గ్రామాల శివారులో గతంలో నిర్మించిన చెరువుల మరమ్మతుల కోసం గత ప్రభుత్వం మిషన్ కాకతీయ పథకం ద్వారా నిధులు సైతం కేటాయించి పలు చెరువుల మరమ్మతులు చేపట్టింది. తాంసి మండల కేంద్రంలో ఉన్న చెరువుకు 20 సంవత్సరాలుగా ఇప్పటివరకు ఎటువంటి మరమ్మతులు చేపట్టలేదు. దీంతో నీటినిల్వ సామర్థ్యం తగ్గి నిరుపయోగంగా మారింది. వానాకాలంలో చేరిన వరదనీరు చెరువుకట్ట లీకేజీ ద్వారా బయటకు వెళ్తుంది. ఏళ్లుగా చెరువు నిర్వహణ పనులు చేపట్టకపోవడంతో పంటలకు సాగునీరు అందని పరిస్థితి నెలకొంది.

450 ఎకరాల ఆయకట్టు..

తాంసి గ్రామ చెరువుకు 450 ఎకరాల ఆయకట్టు ఉంది. కుడి, ఎడమ కాలువలు పూర్తిగా దెబ్బతిన్నాయి. దీంతో ఆయకట్టు వరకు నీరు వెళ్లలేని పరిస్థితి. కుడి కాలువ 6 కిలోమీటర్లు ఉండగా.. ఎడమ కాలువ 3.5 కిలోమీటర్ల పొడువు ఉంది. కాలువల నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో పూర్తిగా పూడుకుపోయాయి. వానాకాలంలో వర్షాలు కురిసినప్పుడు వరద పుష్కలంగా వస్తున్నా చెరువు నిండడం లేదు. దీంతో లీకేజీ నుంచి సాగునీరు వృథా అవుతుంది. కట్టపై పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. నీటి సామర్థ్యం లేక మత్స్యకారులకు ఉపాధి లభించడం లేదు.

తగ్గుతున్న భూగర్భజలాలు..

చెరువు నీటిపై ఆధారపడి పంటలు సాగు చేసిన రైతులకు సాగునీరు అందక పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొంది. చెరువు కట్ట మరమ్మతులు చేపట్టకపోవడంతో గత కొన్నేళ్లుగా చెరువులో నీరు ఉండకపోవడంతో భూగర్భజలాలపై ప్రభావం చూపుతుంది. వేసవి రాకముందే భూగర్భజలాలు తగ్గడంతో గ్రామస్తులకు, రైతులు నీటిఎద్దడిని ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపి చెరువుకు మరమ్మతులు చేపట్టాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

వృథాగా చెరువు నీరు



ప్రతీ ఏటా చెరువులో వర్షాకాలంలో వరదనీరు చెరువులో చేరి వృథా అవుతుంది. నీరునిల్వ ఉండకపోవడంతో సాగు నీరు అందడం లేదు. పిచ్చిమొక్కలు పెరిగి లీకేజీలు ఏర్పడ్డాయి. కాలువలు పూర్తిగా పూడుకుపోయాయి.

– చిల్కూరి వెంకట్‌రెడ్డి, తాంసి

చేపలు ఎదగడం లేదు



గ్రామ శివారులో చెరువు ఉన్నప్పటికి మత్స్యకారులకు ఎలాంటి ఉపయోగం లేదు. చెరువులో చేప పిల్లలను వదిలిన నీరు చివరి వరకు ఉండకపోవడంతో చేపపిల్లలు పూర్తిగా ఎదగడం లేదు. దీంతో చేపలకు మంచి ధర రావడం లేదు.

– జింక రాములు, మత్స్యకారుడు, తాంసి

వ్యాధులపై అవగాహన ఉండాలి


వైద్య పరీక్షలు చేస్తున్న నరేందర్ రాథోడ్

తలమడుగు: వ్యాధులపై ప్రతిఒక్కరికీ అవగాహన ఉండాలని జిల్లా వైద్యాధికారి నరేందర్ రాథోడ్ అన్నారు. సోమవారం మండలంలోని చెర్లపల్లి గ్రామంలో బాలవికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెర్లపల్లి గ్రామంలో కిడ్నీ సంబంధిత వ్యాధులతో గ్రామస్తులు బాధపడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందనారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బాలవికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. రోగులను గుర్తించి రిమ్స్ ఆసుపత్రికి రిఫర్ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్ రెడ్డి, వైద్యులు హరీశ్, సిబ్బంది చిన్నయ్య, శ్రీనివాస్, గంగారం పటేల్, రామ్‌రెడ్డి, బాలవికాస్ మేనేజర్ మధుసూదన్ రెడ్డి, దెబ్బడి అశోక్, ప్రసూన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'రైతు కుటుంబానికి పరిహారం ఇవ్వాలి'


మాట్లాడుతున్న జాదవ్ రెడ్డినాయక్

నార్నూర్: బ్యాంక్ అధికారుల వేధింపులకు గురై ఆత్మహత్య చేసుకున్న రైతు జాదవ్ దేవ్ రావ్ కుటుంబాన్ని ప్రభుత్వం అదుకొని రూ. 50 లక్షల పరిహారం ఇవ్వాలని బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు జాదవ్ రెడ్డి నాయక్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని గాంధీచౌక్ వద్ద ఆల్ ఇండియా బంజారా సేవ సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఆత్మహత్య చేసుకున్న రైతు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబంలో పెద్దను కోల్పోయిన ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బానోత్ గజానంద్ నాయక్, సురేశ్ ఆడే, దిగంబర్ ఆడే, సికిందర్, బీరుజులాల్, చౌహన్ యశ్వంత్ రావ్, వసంత్ ఆడే, మహేందర్, రాథోడ్ దిలీప్, బానోత్ రామారావ్ పాల్గొన్నారు.

చదువుతోనే సమాజంలో గుర్తింపు


పుస్తకం అందజేస్తున్న ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్

కైలాస్‌నగర్: చదువుతోనే సమాజంలో గుర్తింపు, గౌరవం ఉంటుందని విద్యార్థులు కష్టపడి చదివి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని ఎంఐఎం జిల్లా ఇన్‌చార్జి, యాకుత్‌పురా ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మెహరాజ్ అన్నారు. పదో తరగతి విద్యార్థుల కోసం ఎంఐఎం ఆధ్వర్యంలో ముద్రించిన ఆల్ ఇన్ వన్ పుస్తకాలను సోమవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని బాలక్ మందిర్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పంపిణీ చేశారు. పదో తరగతి వార్షిక పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా వందశాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. విద్యతోనే ఉన్నతంగా స్థిరపడవచ్చన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు నజీర్ అహ్మద్, షకీల్ అహ్మద్, షానవాజ్ రహమాన్, మహమ్మద్ రోహిత్, ఆసిఫ్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు కేటాయింపు


షెడ్డును ప్రారంభిస్తున్న భోజారెడ్డి.

తాంసి: అభివృద్ధి పనులకు నిధులు కేటాయించి పనులు ప్రారంభిస్తున్నట్లు డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని వడ్డాడి గ్రామంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రాంగణంలో ఎస్డీఎఫ్ నిధులు రూ.5 లక్షలతో నిర్మించిన షెడ్డును బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. దశల వారీగా నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఆలయానికి ప్రహరీ నిర్మాణానికి సైతం నిధులు మంజూరుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో బోథ్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పోతారెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ శ్రీకాంత్, సంతోశ్, శ్రీధర్ రెడ్డి, నితిన్, వెంకన్న, నారాయణ, హన్మండ్లు పాల్గొన్నారు.

సమగ్ర పరిశీలన తర్వాతే లబ్ధిదారుల ఎంపిక


సర్వేలో పాల్గొన్న మండల ప్రత్యేకాధికారి

నేరడిగొండ: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించనున్న రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డుల జారీ పథకాలకు సంబంధించి సమగ్ర పరిశీలన తర్వాతే లబ్ధిదారులను ఎంపిక చేయడం జరుగుతుందని మండల ప్రత్యేకాధికారి రవి శంకర్ అన్నారు. సోమవారం మండలంలోని బుగ్గారం గ్రామంలో నిర్వహిస్తున్న క్షేత్రస్థాయి పరిశీలనను ఆయన మండల స్థాయి అధికారులతో కలిసి సమీక్షించారు. సాగుకు యోగ్యమైన భూమి, రేషన్‌కార్డుల పరిశీలన ఎంపీడీవోలు, తహసీల్దార్లు సమీక్షించి సూచనలు చేయాలన్నారు. ఈనెల 21 నుంచి 24 వరకు జరిగే గ్రామసభల్లో నాలుగు పథకాల లబ్ధిదారుల పేర్లను వివరించాలన్నారు. ఎంపీడీవో రాజ్‌వీర్, ఎంపీవో లక్ష్మణ్, మండల వ్యవసాయాధికారి కృష్ణవేణి, ఎంఈవో భూమారెడ్డి, ఈజీఎస్ ఏపీవో వసంత్‌రావు, ఐకేపీ ఏపీఎం ఉత్తమ్, ఏఈవోలు నాగేంద్ర ప్రసాద్, సతీష్, సర్వేయర్ శంకర్, ఏఈవో జైపాల్, పంచాయతీ కార్యదర్శి సురేశ్‌రావు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

నార్నూర్: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో ఎంఈవో పవార్ అనితకు వినతిపత్రం అందజేశారు. మధ్యాహ్న భోజన రాష్ట్ర సభ్యుడు ఝాడే నాందేవ్ మాట్లాడుతూ.. కార్మికులకు వంట సరుకులు, కోడిగుడ్లు, నిత్యావసర సరుకులు ప్రభుత్వాలే సరఫరా చేయాలన్నారు. అప్పులు చేసి మధ్యాహ్న భోజనానికి అవసరమైన సరుకులు కొనుగోలు చేసి పిల్లలకు వండి పెడుతున్నామన్నారు. వంట పాత్రలు, సరుకులు ప్రభుత్వమే ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఝాడే తాయి, మన్నల బాయి, సక్రవంతి, సలిమా, కవిత, శివబాయి, సులోచనబాయి పాల్గొన్నారు.

అనారోగ్యంతో టీచర్ మృతి

నేరడిగొండ: మండలంలోని బోరిగామ గ్రామంలో అంగన్‌వాడీ టీచర్‌గా విధులు నిర్వహిస్తున్న జాదవ్ సునీత (40) అనారోగ్యంతో ఆదివారం రాత్రి మృతి చెందారు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. మృతురాలి స్వగ్రామమైన రాజురలో సోమవారం అంత్యక్రియలు నిర్వహించారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అంత్యక్రియలకు హాజరై కుటుంబ సభ్యులను ఓదార్చారు.

అ'పూర్వ' సమ్మేళనం



ఇచ్చోడ: మండలంలోని బోరిగామ జిల్లా పరిషత్ పాఠశాల 2004- 05 బ్యాచ్‌కి చెందిన పదో తరగతి విద్యార్థులు సోమవారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. తరగతి గదిలోని జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఒక్కరి యోగా క్షేమాలు అడిగి తెలుసుకుంటు ఉత్సహంగా గడిపారు. అనాడు విద్యాబుద్ధులు చెప్పిన ఉపాధ్యాయులను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామసభలు పకడ్బందీగా నిర్వహించాలి


మాట్లాడుతున్న వాజీద్ అలీ


మాట్లాడుతున్న మనోహర్‌రావు

బోథ్: ఈనెల 21 నుంచి 24 వరకు జరిగే ప్రజాపాలన గ్రామసభలను పకడ్బందీగా నిర్వహించాలని మండల ప్రత్యేకాధికారి వాజీద్ అలీ అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం ప్రారంభించబోతున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, నూతన రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాలకు అర్హుల జాబితా ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమేశ్, ఎంపీవో అతుల్, ఏపీవో జగ్దేరావ్, పర్యవేక్షకులు రాజేశ్వర్ పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

బేల: ఇప్పటిదాకా దరఖాస్తు చేసుకోని వారు ఈనెల 21నుంచి 24వరకు జరిగే ప్రజాపాలన గ్రామసభల్లోనూ రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాల కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల ప్రత్యేకాధికారి మనోహర్‌రావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 21న అవాల్‌పూర్, బాది, బెదోడ, ఖార, పాటన్, పోహర్, పోనాల, 22న చప్రాల, భవానీగూడ(సి), దహెగాం, డోప్టాల, డౌన, గణేష్‌పూర్, గూడ, కొబ్బాయి, మశాల(బి), 23న బేల, చంపెల్లి, దుబ్బగూడ(ఎస్), ఎకోరి, జూనోని, కోగ్దూర్, మణియార్‌పూర్, మశాల(కె), షంషాబాద్, సోన్‌కాస్, తోయగూడ, వరూర్, 24న సాంగ్వి, కాప్సి(బి), మాంగ్రుడ్, పిటగావ్(ఎల్), సదల్‌పూర్, సాంగిడి, సిర్సన్న, సైద్‌పూర్, టాక్లీ గ్రామాల్లో గ్రామసభలు ఉంటాయని తెలిపారు.

నార్నూర్: మండల కేంద్రంలోని డబుల్ బెడ్ రూం ఇళ్ల పంపిణీపై సోమవారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ జాడి రాజలింగో ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. స్థానిక ప్రజా ప్రతినిధులతోపాటు గ్రామ పెద్దలు పాల్గొన్నారు. తహసీల్దార్ మాట్లాడుతూ మండల కేంద్రంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం పంపిణీ లబ్ధిదారుల ఎంపిక కోసం గ్రామసభ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఏజెన్సీ చట్టాలకు మేము వ్యతిరేకం కాదని ఏజెన్సీ చట్టాలను గౌరవిస్తూనే 1950 నుంచి ఉంటున్న నాన్ ట్రైబల్స్ లకు డబుల్ బెడ్ రూమ్‌లు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బానోత్ గజానంద్ నాయక్, ఆడే సురేశ్, సికిందర్ రాథోడ్, బిక్కు రాథోడ్, లోకండే చంద్రశేఖర్, లోకండే దేవరావు, రాథోడ్ ఉత్తమ్ పాల్గొన్నారు.

ట్యూషన్ ఫీజు చెల్లింపు గడువు పెంపు

కైలాస్‌నగర్: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ రెండో, మూడో సంవత్సరం, పీజీ రెండో సంవత్సరం ట్యూషన్ ఫీజు చెల్లింపు గడువును యూనివర్సిటీ అధికారులు పొడగించారని ప్రభుత్వ సైన్సెస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సంగీత ప్రకటనలో తెలిపారు. ఈనెల 25న వరకు ఫీజు చెల్లించవచ్చని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఆర్థిక సాయం

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణంలోని రణదివేనగర్ కాలనీలో మూడు రోజుల కిందట జరిగి న అగ్నిప్రమాదంలో ఇల్లు దగ్ధమై సర్వం కోల్పోయిన పోటీపెల్లి వెంకటేశ్ కుటుంబానికి సామాజిక కార్యకర్త ముడుపు మౌనిశ్ రెడ్డి అండగా నిలిచారు. సోమవారం కాలనీకి చేరుకుని అగ్నికి ఆహుతైన ఇంటిని పరిశీలించారు. ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట కాలనీవాసులు రాహుల్, అశోక్ రెడ్డి, శివ, సురేందర్ రెడ్డి, సాయి, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

కైలాస్‌నగర్: జంగుబాయి దర్శనానికి వెళ్తూ ఐషర్ వాహనం బోల్తాపడిన ప్రమాద ఘటనలో గాయపడి రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను మాజీ ఎంపీ సోయం బాపూరావు, మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొరంచు శ్రీకాంత్ రెడ్డి సోమవారం వేర్వేరుగా పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్‌ను అడిగి తెలుసుకున్నారు. వారికి మెరుగైన వైద్యం అందించాలన్నారు. వారి వెంట బీఆర్ఎస్ నాయకులు యూనిస్ అక్బానీ, విజ్జగిరి నారాయణ, పరమేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌రూరల్: జంగుబాయి దైవ దర్శనానికి వెళ్తున్న ఆదివాసీలు నార్నూర్ మండలంలో రోడ్డు ప్రమాదానికి గురై క్షతగాత్రులను ఆదివాసీ పర్ధాన్ సేవ సంఘ సభ్యులు పీవీటీజీ ఏపీవో మనోహర్‌తో కలిసి పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్‌ను కోరారు.

బేల: మండలంలోని రేణుగూడ గ్రామంలో (ఇటీవల ఆత్మహత్య చేసుకున్న) బాధిత రైతు జాదవ్ దేవ్‌రావు కుటుంబాన్ని సోమవారం కాంగ్రెస్ ఆదిలాబాద్ నియోజకవర్గం ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి, బోథ్ నియోజకవర్గం ఇన్‌చార్జి ఆడె గజేందర్‌లు పరామర్శించారు. బాధిత కుటుంబానికి రూ.25వేల ఆర్థిక సాయాన్ని అందించారు.

కుల ధ్రువీకరణ పత్రం జారీ చేయాలి


నార్నూర్: ఎస్సీ మాంగ్ కుల ధ్రువీకరణ ప త్రం తహసీల్దార్ కార్యాలయంలో జారీ చే యాలని సంఘం నాయకులు డిమాండ్ చేశా రు. సోమవారం తహసిల్దార్ జాడి రాజలింగు కు నాయకులు వినతిపత్రం అందజేశారు. ఆర్డీవో కార్యాలయం నుంచి కుల ధ్రువీకరణ పత్రం తీసుకోవడం ఇబ్బందిగా ఉందన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు గైక్వాడ్ చంద్రకాంత్, సునీల్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాజీరావ్ సప్తాహం


శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

తాంసి: మండలంలోని వడ్డాడి గ్రామంలో ఏడు రోజులుగా నిర్వహిస్తున్న బాజీరావు బాబా భవ్య జ్ఞానేశ్వరి పారాయణ సప్తాహం ముగింపు కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. వారం రోజులుగా కొనసాగుతన్న సప్తాహం కార్యక్రమంలో భాగంగా ప్రతీరోజు బాజీరావు బాబా శిష్యులు హరిపాట్, గీతాపారాయణంను భక్తులకు చదివి వినిపించారు. మంగళవారం సప్తాహం ముగింపు సందర్భంగా బాజీరావు బాబా శిష్యులు, భక్తులతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. ఎడ్లబండిలో వివిధ వేషాధారణలో చిన్నారులను ఉంచి ఊరేగింపు నిర్వహించారు. డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆడే గజేందర్ ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త బండారి దేవన్న, బాజీరావు బాబా శిష్యులు భూమన్న, లక్ష్మణ్, రాజు, స్వామి పాల్గొన్నారు.

ఆడే గజేందర్ ప్రత్యేక పూజలు


పూజలు చేస్తున్న ఆడే గజేందర్

నేరడిగొండ: మండలంలోని కొర్టి కల్ గ్రామంలో జరుగుతున్న బండారా కార్యక్రమంలో సోమవారం కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడతూ గ్రామాల్లో పూజలు చేయడం ద్వారా సుఖశాంతులు నెలకొంటాయన్నారు. ఆయన వెంట బోథ్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బద్దం పోతారెడ్డి, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు హీరాసింగ్, కరాడ్ బ్రహ్మానంద్, జలంధర్, అజీమ్, షబ్బీర్, శంకర్, పాల శంకర్, కుంట శంకర్, కపిల్ పాల్గొన్నారు.